ప్రజాశక్తి

మంగళవారం 8 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి

నేడు వైఎస్.జగన్ రాక

- హెలిప్యాడ్ స్థలం మార్పు
- పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబానికి పరామర్శ
- అనుమతిలేని వారు రావొద్దంటూ పోలీసులు హెచ్చరిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లాకు మంగళవారం నాడు రానున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తరువాత తొలిసారిగా జిల్లా పర్యటనకు జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. సత్యసాయి జిల్లాలోని రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురబ లింగమయ్య హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే నిందితులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ హత్య ఘటన జరిగిన వెంటనే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోనులో పరామర్శించారు. అదే సమయంలో తాను వస్తానని కూడా బాధితులకు చెప్పారు. ఆ ప్రకారమే ఆయన మంగళవారం నాడు పాపిరెడ్డిపల్లి రానున్నారు.

హెలీప్యాడ్ స్థలం మార్పు

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బెంగుళూరు నుంచి చెన్నేకొత్తపల్లికి హెలికాప్టర్‌లో వచ్చి.. అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంది. చెన్నేకొత్తపల్లిలో హెలీప్యాడ్‌కు పోలీసులు అనుమతించలేదు. కుంటిమద్ది, పాపిరెడ్డి గ్రామాల మధ్య ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో అక్కడికి మారుస్తున్నారు. ఆ గ్రామాల మధ్యలో దిగి పాపిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. ఉదయం 11.05 నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు పాపిరెడ్డిపల్లిలో ఉండి తిరుగు ప్రయాణం కానున్నారు.

టెన్షన్...టెన్షన్

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో తొలిపర్యటన టెన్షన్ వాతావరణం నడుమ సాగనుంది. ఎంపిపి ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి రాప్తాడులో అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఉద్రిక్తత పరిస్థితులే కొనసాగుతూ వచ్చాయి. ఇదే సమయంలో పాపిరెడ్డిపల్లిలో హత్య జరగడంతో ఇది తీవ్ర స్థాయికి చేరింది. అప్పటి నుంచి రెండు పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా విచ్చేస్తుండటంతో ఇది మరింత తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. పాపిరెడ్డిపల్లి అందరూ రావద్దని ముఖ్య నేతల వరకే అనుమతి ఉంటుందని చెబుతున్నారు. వైసిపి నేతలు మాత్రం పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠత నెలకొంది.

పాపిరెడ్డిపల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పాపిరెడ్డిపల్లిలో పోలీసు పికెట్

ధర్మవరం రూరల్ : రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మంగళవారం నాడు పర్యటించనున్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో సందర్భంగా పోలీసులు అప్రమత్తం అయ్యారు. రెండు పార్టీల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరింపజేసి పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. గత వారంలో ఉగాది పండుగ సందర్భంగా పాపిరెడ్డిపల్లిలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో వైసిపి మద్దతుదారుడు లింగమయ్య మతి చెందాడు. ఈయన మృతి అనంతరం ఇది రాజకీయ ఘటనగా మారింది. టిడిపి, వైసిపి నాయకులు ఈ ఘటనపై పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ఈ ఈ నేపథ్యంలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు 8వ తేదీ వస్తున్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తును కట్టుదిట్టం చేసి, పోలీసు ఆంక్షలను విధించారు. పాపిరెడ్డి గ్రామంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న స్వయంగా పరిశీలించి భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదే నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామం, ఇరుకు రోడ్లు ఉన్న నేపథ్యంలో ఎక్కువ మంది గ్రామానికి రావడానికి వీల్లేదంటూ ఇప్పటికే పోలీసులు ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

గ్యాస్ బండ..!

కేంద్రంలోని బిజెపి మరోమారు ప్రజలపై గుది'బండ' మోపింది. గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.50 పెంచి పేద, సామాన్య జనం నడివిరిచింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతం అవుతున్న సామాన్యులకు గ్యాస్ సిలిండర్ ధర పెంపు మరింత భారంగా మారింది. పెరిగిన సిలిండర్ ధరలు సామాన్యుడి జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏకంగా సిలిండర్‌పై రూ.50 పెంచడంపై ప్రజల నుంచి సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

- సిలిండర్‌పై ఏకంగా రూ.50 పెంపు
- చితికిపోతున్న సామాన్యుని జీవనం
- కేంద్రం తీరుపై సర్వత్రా విమర్శలు



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గృహ వినియోగదారులు, ఉజ్వల సిలిండర్‌పై రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయని పేర్కొంది. ఇప్పటికే పెట్రోల్, డీజల్, నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై గ్యాస్ ధర పెంపుతో మరింత భారం మోపినట్టయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చూస్తే అనంతపురం జిల్లాలో 5,57,975, శ్రీసత్యసాయి జిల్లాలో 6,67,268 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ప్రస్తుతం వీరందరిపై పెంచిన గ్యాస్ సిలిండర్ల భారం పడనుంది. ఇందులో సగటున నెలకు ఐదు లక్షల వరకు గ్యాస్ సిలిండర్ల వాడకం ఉండగా, సగటున పెంచిన భారం ప్రకారం రూ.2.50 కోట్ల వరకు అదనపు భారం ప్రజలపై పడనుంది.

కార్పొరేట్‌ల కోసమే గ్యాస్ ధరల పెంపు : వి.రాంభూపాల్

కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. గ్యాస్ ధరల పెంపు వ్యతిరేకిస్తూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా నుంచి చౌకగా ముడి చమురు వస్తే పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించకుండా అంబానీ రూ.లక్షల కోట్లు దోచుకోవడానికి కేంద్రం కారణమైందన్నారు. ఒకవైపు మత భావాలను రెచ్చగొట్టడం మరోవైపు ప్రజలపై భారాలు వేయడం బిజెపి విధానమని విమర్శించారు. గృహ సిలిండర్లు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణంగా ఉందన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసరాలైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమే అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ధర పెంపు సరికాదు..

ఇప్పటికే అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగాయి. వీటికితోడు వంట గ్యాస్ సిలిండర్‌ను పెంచితే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతారు. ఓ వైపు ఉచితంగా సిలిండర్ల అంటూ మరో వైపు ఇలా ధరలు పెంచుతూ పోతే సామాన్యులకు వనగూరే ప్రయోజనం ఏమీ లేదు. ధరలను తగ్గించాల్సిన ప్రభుత్వం ఇలా పెంచడం సరికాదు. భారాలను ప్రభుత్వం మోపుతూపోతే సామాన్య కుటుంబాలు మరింత దెబ్బతింటాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిలిండర్ ధరల పెంపుపై పునరాలోచించి, దానిని తగ్గించాలి.

అరుణ, గృహిణి, అనంతపురం.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని, పి 4 సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ టి ఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం పి జి ఆర్ ఎస్ మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 220 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. గతంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను ఇంకా పరిష్కారం కాని వాటిపై సత్వరమే దృష్టి సారించాలని అన్నారు.. జిల్లాలో అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టులు హంద్రీనీవా, జాతీయ రహదారులు, రైల్వే భూ సేకరణ అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికను వచ్చేవారం 9 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఏపీఎంవైపి పీడీ సుదర్శన్, సిపిఒ విజయకుమార్, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, ఎల్ డి ఎం రమణకుమార్, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు

పుట్టపర్తి అర్బన్ : పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ప్రతి చోటా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం అనంతరం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టానికి సంబంధించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

కదిరి ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- సొంత పార్టీ కౌన్సిలర్ల తిరుగుబాటు
- 23న ముహూర్తం ఖరారు
- ఛైర్మన్ సీటుకోసం పలువురి పోటీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి వైసిపిలో నెలకొన్న అంతర్గత విభేదాలు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుర్చీకి ఎసరుపెట్టాయి. వైసిపి అధికారంలో ఉన్నంత వరకు గుంభనంగా ఉన్న విభేదాలు టిడిపి అధికారంలోకి రాగానే ఒక్కసారిగా బహిర్గతం అయ్యాయి. ఛైర్‌పర్సన్‌తో పాటు, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కదిరి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన మక్బూల్ బాషాపై ఆ పార్టీలో తీవ్ర వ్యతిరేకత కన్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే అటు ఛైర్‌పర్సన్, ఇటు సమన్వయకర్తపై సొంత పార్టీ కౌన్సిలర్లే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ ఛైర్‌పర్సన్ మా కొద్దంటూ బహిరంగ పోటీకి సిద్ధం అయ్యారు. కౌన్సిలర్లు సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మాన పత్రం అధికారులకు అందడంతో ఈ నెల 23వ తేదీన ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం అంశంపై అత్యవసర మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించేలా అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు.

2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కదిరి పట్టణంలో 36 వార్డులు ఉండగా వైసిపికి స్పష్టమైన మైజార్టీ సాధించి ఛైర్మన్ సీటును కైవసం చేసుకుంది. ఛైర్మన్ ఎన్నిక సమయంలో పోటీ ఎక్కువగా ఉండడంతో పదవీ కాలాన్ని చెరో రెండున్న సంవత్సరాలుగా కేటాయిస్తూ అప్పటి ఎమ్మెల్యే పివి.సిద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్ణయం జరిగింది. ఈ ఒప్పందం మేరకు మొదటి భాగం ఛైర్‌పర్సన్‌గా పరికి నజీమున్నిసాను ఎన్నిక చేశారు. రెండున్నర సంవత్సరాల తర్వాత ఆమె పదవి నుంచి తప్పుకోవాల్సి ఉన్నా అది జరగలేదు. ఈ నేపథ్యంలో సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచే వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. ఆ తర్వాత వైసిపి అధికారం కోల్పోవడంతో ఈ వ్యతిరేకత మరింత ఎక్కువై ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వరకు పరిస్థితి వచ్చింది.

23న ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నిసాపై అవిశ్వాసం తీర్మానం చేస్తూ గత వారం కొందరు కౌన్సిలర్లు సంతకాలు చేసిన జాబితాను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్ టిఎస్.చేతన్‌కు అందజేశారు. వైసిపి కౌన్సిలర్‌లు కిన్నెర కళ్యాణ్, రంగా రెడ్డిలు కలెక్టర్‌ను అవిశ్వాస నోటీసు ఇచ్చారు. ఈ నోటీసును అందుకున్న అధికారులు ఈ నెల 23న కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమావేశం నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

అవిశ్వాస పత్రంపై 25 మంది సంతకాలు

ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడాన్ని బలపరుస్తూ 25 మంది వైసిపి కౌన్సిలర్లు సంతకాలు చేశారు. ఇప్పటికే వీరిలో చాలా మంది టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపుకోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో టిడిపి ఆచితూచి అడుగులు వేస్తోంది. ఎవరిని పార్టీలో చేర్చుకోవాలి.. ఎవరిని వద్దనాలనే దానిపై కసరత్తు చేస్తోంది.

సమన్వయకర్త లోపమేనా..?

కదిరి వైసిపిలో నెలకొన్న సంక్షోభానికి సమన్వయకర్త లోపమేనని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. వైసిపి అధికారం కోల్పోయాక పార్టీ కార్యడర్‌కు అండగా ఉండాల్సిన సమన్వయ కర్త మక్బూల్ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నెలలు తరబడి కదిరికి దూరంగా బెంగళూర్‌లో వ్యక్తిగత వ్యాపారంలో నిమగ్నమై శ్రేణులకు అందుబాటులో ఉండడంతో పార్టీకి నడిపించే నాయకుడు కరువయ్యారు. పార్టీ నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో కౌన్సిలర్లు ఎవరిదారి వారు చూసుకుంటున్నారు.

అవిశ్వాసానికి మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు..!

కదిరి మున్సిపాల్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితి చూస్తే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి కౌన్సిలర్ల మద్దతు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపాల్టీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో వైసిపి 31 స్థానాల్లో గెలవగా, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైసిపికి చెందిన ఐదుగురు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ ప్రకారం మున్సిపల్ కౌన్సిల్‌లో టిడిపి బలం 11కి పెరిగింది. వైసిపికి 25 మంది మద్దతు ఉండగా వీరిలో చాలా మంది ఇప్పుడు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధం అయ్యారు. నియోజకవర్గ అభివద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెంట నడిచేందుకు పలువురు కౌన్సిలర్ల అడుగులు వేస్తున్నారు. ఇలా మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిష కుర్చకి ఎసరు తప్పదన్న అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాస తీర్మానంలో ఛైర్‌పర్సన్ నజీమున్నిసా దిగిపోతే ఛైర్‌పర్సన్ పోటీల్లో ఇద్దరి పేర్లు ప్రముఖంగా విన్పిస్తోంది. 23వ తేదీ తర్వాతనే ఛైర్మన్ ఎవరన్నదానిపై నిర్ణయం తీసుకునేలా అవిశ్వాసానికి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు అందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని యనమల పల్లి గ్రామ సచివాలయా సిబ్బంది పనితీరుపై స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం యనమలపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు.ఉదయం 10 గంటలు దాటినా సచివాలయానికి తాళం వేసి ఉండటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రహ్లదకు ఫోన్ చేసి ఆ సచివాలయం వద్దకు రప్పించుకున్నారు. విధులకు హాజరుకాని గ్రామ సచివాలయం ఉద్యోగులకు చార్జీ మెమో ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అన్నారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను హాజరు పట్టీకలో పరిశీలించారు .విధులకు హాజరైన వారికి హాజరు వేశారు. విధులు హాజరు కాని వారికి ఛార్జ్ మెమో ఇవ్వాలని కమిషనర్ కు ఆదేశాలించారు. భవిష్యత్తులో విధులకు సక్రమంగా హాజరుకాని ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద , డీఈ నరసింహమూర్తి , టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్ లక్ష్మీపతి, రామారావు, పీసి గంగన్న , సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

ఇష్టపడి చదవాలి : మండల పరిధిలోని బీడు పల్లి ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ మంచి ఫలితాలు వచ్చేలా బోధన ఉండాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై అక్కడ ఉన్న ప్రధాన ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఫిరోజ్ బేగం, ప్రభుత్వ వైద్యులు, పట్టణ టిడిపి కన్వీనర్ రామాంజనేయులు అంబులెన్స్ రమేష్, సామకోటి ఆదినారాయణ ,ఉమాపతి యాదవ్ ,శుభచంద్ర, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేస్తే ఆప్కాస్ రద్దును స్వాగతిస్తాం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నో సంవత్సరాలుగా పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌కార్మికులను పర్మినెంట్ చేసిన తర్వాతే ఆప్కాస్ ను రద్దు చేయాలని... అలా చేయకుండా ఆప్కాస్ ను రద్దుచేసి గుత్తేదారులకు అప్పగించాలని చూస్తే ం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ హెచ్చరించారు. ఆప్కాస్ రద్దు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో పారిశు ధ్యకార్మికులు సోమవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన చేసి, కమిషనర్‌కు వినతిని ఇచ్చారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూఅధికారంలోకి వస్తే కార్మికులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీలపై హామీ ఇచ్చి అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు నాయుడు ఆప్కాస్ ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పరుగు సేవల సిబ్బందిని నియమించుకునే అధికారం కల్పిస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవడమే కాకుండా దానికి సంబంధించి ఉత్తర్వులను ఇచ్చి అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే జరిగే లక్షలాదిమంది కార్మికులకు అన్యాయం చేయడమే అన్నారు. వెంటనే మంత్రివర్గ నిర్ణయాన్ని, ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఆనంద్, రామచంద్ర, గుర్నాథ్, మూర్తి, లక్ష్మమ్మ, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, నాగలక్ష్మి, శంకర్ తో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలో రేషన్ కార్డు దారులకు చౌక దుకాణాలలో రేషన్ సరుకులు ప్రతినెల 15 తేదీ వరకు సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మారుతికి అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రేషన్ కార్డు దారులను ఏ స్టోర్ పరిధిలో కార్డు ఉంటే అక్కడే బియ్యం తీసుకోవాలని డీలర్లు కార్డుదారులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. అంతేకాకుండా పలువురు డీలర్లు రెండు రోజులు మాత్రమే సరుకులు పంపిణీ చేసి మిగతా వారికి బియ్యం స్టాకు లేవని చెబుతున్నారని విమర్శించారు. దీనివల్ల కార్డుదారులకు బియ్యం అందక అధిక ధరలు చెల్లించి బియ్యం కొనాల్సి వస్తుందన్నారు. తూకాలలో రేషన్ డీలర్లు బియ్యం కోత విధిస్తున్నారన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారుల సమస్యపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అందరికీ సరుకులు అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 16న డీలర్లతో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి ప్రతి డీలరు షాపు వద్ద నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేసి సరుకుల పట్టిక తో పాటు తూకాల్లో వ్యత్యాసాలు లేకుండా లబ్ధిదారులకు సరుకులు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేష్, స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, నంజుండప్ప ప్రదీప్ లోకేష్, కృష్ణారావు, రామాంజనేయులు, లక్ష్మీదేవి, రవి, హబీబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వహణపై విచారణ



హెచ్‌ఎం, ఎజెన్సీ నిర్వహకులతో విచారణ చేస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాలలో (ఎంజీఎం) పాఠశాల హెచ్‌ఎం నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఈ విషయంపై అర్ధాకలితో ఎంజిఎం విద్యార్థులు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శనివారం కథనం వెలువడింది. ఈ కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదికను సమర్పించాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, భోజన ఏజెన్సీ నిర్వాహకులు తిరుపతయ్యతో వివరాలను సేకరించారు. ఈ విషయంపై విచారణ అధికారిణిగా ఉన్న ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ ఇద్దరి వద్ద రిపోర్టు తీసుకుని నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. అయితే ఈ విచారణలో అధికారులు అవినీతికి పాల్పడిన హెచ్‌ఎం కు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మధ్యాహ్న భోజనంతో పాటు ఈ పాఠశాలలో జరిగిన నాడు నేడు పనులపై సైతం సమగ్రంగా దర్యాప్తు జరిపితే పెద్దఎత్తున అవినీతి బయటపడే అవకాశాలు ఉన్నాయి.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - రొద్దం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని సోమయాజులపల్లి అంగన్వాడి కేంద్రంలో సోమవారం కదిరి సిడిపిఓ జయంతి ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లల ఆడుకోవడానికి కిట్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి అంగన్వాడి టీచర్ ఈశ్వరమ్మ, అంజనమ్మ, ఆయా పార్వతి, గ్రామస్తులు రామాంజన్‌రెడ్డి, చంద్ర, హుస్సేన్ మియా తదితరులు పాల్గొన్నారు

రోడ్లపై నిలిచిన మురుగు

ప్రజాశక్తి - పావగడ

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్య ప్రవహించే పరిస్థితి తాలూకాలోని చిక్కజాలోడు గ్రామంలో నెలకొంది. సరైన డ్రైనేజీ లేకపోవడంతో గ్రామస్తులు తమ ఇంటి మురుగు నీటిని వీధిలోకి వదులుతున్నారు. దీంతో రోడ్డుపైకి మురుగునీరు చేరి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు నిలయాలుగా మారాయంటున్నారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకముందే స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు మండల మీట్

ప్రజాశక్తి - నంబులపూలకుంట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అంజినప్ప తెలిపారు. ఎంపీపీ ఈటెల రాము అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: PENUKONDA.
O.P. No: 1/2024

Between:
Official Receiver, **...Petitioner**
And
Ramaehandrappa died by Lrs and others
...Respondents

NOTICE TO THE RESPONDENTS No: 2 AND 4

To
R2: G.Laksmminarayana S/o G.Sreeramulu, Chinnamanthuru Village, Roddam Mandal.
R4:G.Suresh S/o Late G.Ramachandrappa Thumukunta Check post Village, Hindupu Mandal.

వాది అయిన official receiver, Ananthapuramu గారు ఆస్తి స్వాధీనము చేసుకొనుట కొరకు పై షెడ్యూలు దావా కోర్టునందు వేసినారు. అందులో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చినారు. అర్జీలో మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినా అవి మీకు చేరి ఉండలేదు.కావున ఈ ప్రకటన చూసిన అంతరం పై కోర్టు నందు 10-04-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు ఖుద్దున గానీ, లేక వకీలు ద్వారా గాని పై కోర్టునందు హాజరు అయి ఏవైన ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును.అట్లు హాజరు కానిచో మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

వాయిదా తేది:10-04-2025

("By Order of the Court")

ఇట్లు
సి.ఆర్.నాగార్జున,ఎం.ఏ, ఎం.ఎల్,
జి.ప్రకాష్ కుమార్,ఎం.కాం, ఎల్.ఎల్.బి,
అడ్వకేట్స్, పెనుకొండ. శ్రీ సత్యసాయి జిల్లా.
సెల్ నెం:9492584259

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), కదిరి.
O.S. No: 902/2022

Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Nallamada Branch వారు Rep by Branch Chief Manager, Nallamada
...Plaintiff
మరియు
D1:మట్ర రాధాదేవి W/o ఆదిశేషు Residing at వెల్లమద్ది నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. **...Defendant**

పై దావాలోని ప్రతివాదికి నెం.1కి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Nallamada Branch వారు) ప్రతివాదులు D1 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 01-05-2025వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు.కావున మీరు 01-05-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపు కొనవలెను.లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

స్థలం : కదిరి
వాయిదా:01-05-2025

ఇట్లు
G.గురులింగస్వామి, B.A.,B.L,
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), కదిరి.
I.A. No: 70/2024 in A.S. No: /2024

Between:
పాళ్యం ఖాదర్ బి మరియు ఇతరులు
...Petitioner/Appellants
మరియు
షేక్ అబ్దుల్ అలీ మరియు ఇతరులు
...Respondants/Respondants
R2:కె.నూరుల్లా S/o అమీర్‌సాబ్ Residing at D.No:1-149, సోమగుట్ట స్ట్రీట్, కదిరి టౌన్ మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. **...Respondants**

పై పిటీషన్‌లోని ప్రతివాది నెం.2కి నోటీసులు

పై పిటీషన్‌లోని వాదులుపాళ్యం ఖాదర్ బి మరియు ఇతరులు ప్రతివాదులు నెం:2 అయిన మీ పైన మరియు ఇతరులపైన delay condonation petition for filling appeal ను పై కోర్టులో దాఖలు చేసి యున్నారు. పై పిటీషన్‌ను ఘనమైన కోర్టు వారు 23-04-2025వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు.కావున మీరు 23-04-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపు కొనవలెను.లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

స్థలం : కదిరి
వాయిదా:23-04-2025

ఇట్లు
G.గురులింగస్వామి, B.A.,B.L,
పిటీషనర్స్ తరుపు వకీలు, కదిరి

భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం

తహశీల్దార్‌కు విన్నవించిన గ్రామస్తులు

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ప్రజాశక్తి - అగళి

ఇండస్ట్రీయల్ హబ్‌కు తమ భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యమని మండలంలోని హెచ్‌డి హళ్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు తెగేసి చెప్పారు. ఈ మేరకు ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యను అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుత హెచ్ డి హళ్ళి పంచాయతీలో సుమారు 3,800 ఎకరాలు భూములు ఉన్నాయన్నారు. సుమారు 1500 ఎకరాల్లో వేరుశనగ పంట పండిస్తారన్నారు. ఈ పంచాయతీలో సుమారు 215 మంది రైతులు 15 సంవత్సరాల మునుపే అప్పు చేసి బోరు బావులు వేసుకుని వక్క, టెంకాయ, మామిడి, అరటి, మల్బరీ, వేరుశనగ, పువ్వులు, బొప్పాయి వంటి పంటలను పండిస్తున్నారన్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు మడకశిరకు వచ్చినప్పుడు ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రీయల్ హబ్‌గా మార్చుతామని చెప్పారన్నారు. అందులో భాగంగా కలెక్టర్ చేతన్ కుమార్ వారం రోజుల క్రితం అగళి మండలంలోని హెచ్‌డి హళ్లి పంచాయతీ పరిధిలోని భూములు ఇండస్ట్రియల్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని పరిశీలన చేసి వెళ్లారన్నారు. తమ భూములు ఇండస్ట్రీయల్ హబ్‌కు తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం చేస్తున్న తాము రోడ్డున పడతామని వాపోయారు. తాము భూములు ఇచ్చే ప్రసక్తే లేదని అన్నారు. బలవంతంగా భూములు తీసుకుంటే ఆత్మహత్య శరణ్యమని అన్నారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సుబ్బారావుకు అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నష్టాన్ని కలిగించే పనిచేయదని ఈ విషయాన్ని పై అధికారుల తృష్టికి తీసుకెళ్తానని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ పార్థసారథి పేర్కొన్నారు. బత్తలపల్లి మండలంలో హాస్పిటల్ ఆన్ వీల్స్ అనే వైద్య శిబిరాన్ని ఎంపీ సోమవారం ప్రారంభించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎంపీ మాట్లాడుతూ ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. మొబైల్ మెడికేర్ మిషన్‌ను ఈసందర్భంగా ప్రారంభించి, ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రజలకు అంకితం చేశారు. ఇది ఆసియాలోనే తొలిసారిగా అందించబడుతున్న ప్రత్యేకమైన సేవ అని ఎంపీ అన్నారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య సేవలు ఆధునిక నిర్ధారణ పరికరాలతో అందిస్తారన్నారు. అంతేకాకుండా ఆరోగ్య రథం అనే పేరుతో సేవలను మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల వరకు చేరేలా తయారు చేయబడిందన్నారు. ఈ శిబిరంలో వైద్య చికిత్సలతో పాటు మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే వైద్య శాఖలో పెను మార్పులను తీసుకొని వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్,కోటి సూర్య ప్రకాష్ బాబు, డిఎంహెచ్ఒ ఫైరోజ్ బేగం, డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్, మెడికల్ కోఆర్డినేటర్ ప్రదీప్, దయాకర్, మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర, టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మహేష్ చౌదరి, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు సురేంద్రనాయుడు, నెట్టం రమణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

తమకు ఇచ్చిన పట్టాలను చూపుతున్న మహిళలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

నిరుపేదలకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను అధికార పార్టీ అండతో ఆక్రమించుకునేందుకు కొందరు నేతలు కుట్రలు పన్నుతున్నారని, అర్హులైన తమకు న్యాయం చేయాలని మండలంలోని సూర్యచంద్రాపురం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతులు మీదుగా దంపెట్ల గ్రామ పొలంలోని 107 సర్వే నెంబర్లో 11 మంది ఎరికల సామాజికవర్గం వారికి ఒక్కొక్కరికి 2ఎకరాలు చొప్పున పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టాలు పొందిన తరువాత 5, 6 సంవత్సరాలు తాము సాగులో ఉన్నామనితెలిపారు. వర్షాభావం వల్ల పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో పంటలు సాగు చేయలేకపోయామన్నారు. దీంతో ఆ భూముల్లో కంపచెట్లు పెరిగాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రీ సర్వే ప్రకటించడంతో సర్వేయర్ భూముల్లో కంపచెట్లు తొలగిస్తే సర్వే చేస్తామని చెప్పడంతో అందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఇంతలో దంపెట్ల గ్రామానికి చెందిన హరిదాను తన తోటకు దగ్గరగా ఉందని ఆ భూముల్లో రాత్రికి రాత్రే దౌర్జన్యంగా కంపచెట్లు జెసీబీతో తొలగించి మామిడి మొక్కలు నాటుతుండగా తాము అడ్డుపడినట్లు తెలిపారు దీంతో తమను కులం పేరుతో దూషించి ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరించారని వాపోయారు. ఈ విషయాన్ని విఆర్ఒ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఇంతవరకు తమకు న్యాయం జరగలేదని వాపోయారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని బాధితులు నాగేంద్రమ్మ, ఉమాదేవి, రామలక్ష్మి, రామాయనమ్మ, లావణ్య, నారాయణమ్మ, లక్ష్మీదేవి, సాలమ్మ, తనజ, మణిమ్మందమ్మ కలెక్టర్‌ను కోరారు.

సమస్యలు పరిష్కరించండి

ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలో ఇష్టారాజ్యంగా పశువులు సంతలోకి రావడం వల్ల అటు వ్యాపారులు ఇటు కొనుగోలుదారులు ఇబ్బందులు గురవుతున్నారని ఊరి పశువులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమీపంలోని కియా అనుబంధ సంస్థలు బెంగళూరు వెళ్ళు హైవే బస్సులు వారపు సందులో రావడం వల్ల రద్దీ పెరిగి ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ మేరకు సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు, గ్రామస్తులు స్థానిక ఎస్ఐ రమేష్ బాబుకు వినతిపత్ర అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే కూరగాయల వారపు సంత ఉదయం 10 నుండి రాత్రి 7 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం వేలాదిమంది వ్యాపారులు , ప్రజలతో రద్దీగా ఉంటుందన్నారు. పెనుకొండ నుండి సోమందేపల్లి మీదుగా పాలసముద్రం మరియు బెంగళూరుకు వెళ్లే కియా అనుబంధ పరిశ్రమ బస్సులు ప్రైవేటు బస్సులు సంత జరిగే రద్దీ ప్రాంతం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. వీటితో పాటు పశువులు నియంత్రణ లేక కలియ తిరగడం వల్ల ప్రజలకు , వ్యాపారులకు అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ , మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్ , కెవిపిఎస్ వెంకటేష్ , కొండా వెంకటేష్ , గంగరాజు , ఈడిగ నాగరాజు , మాబు , బెస్త కిష్టప్ప , కుమ్మర కిష్టప్ప , పటాకుల శీన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శిగా వీరయ్య

వీరయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శిగా వీరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న వీరయ్యను ప్రభుత్వం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శిగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అధికారిక వ్యక్తిగత కార్యదర్శిగా బాలాజీ బాధ్యతలు నిర్వహిస్తుండగా పార్టీ సమన్వయకర్తగా పావులూరు శ్రీనివాసరావు, అనధికారిక వ్యక్తిగత కార్యదర్శిగా డాక్టర్ సురేంద్ర ఇక్కడ కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో వ్యక్తిగత కార్యదర్శిగా వీరయ్య నియమితులు కావడం గమనార్హం. కాగా వీరయ్య బాధ్యతలు స్వీకరించడానికి వస్తున్న విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చెక్ పోస్టుకు వెళ్లి ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో హిందూపురం చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు వీరయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వార్డు ఒక చోట.. సచివాలయం మరో చోట...

ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మాకొడుతున్న సచివాలయ కార్యదర్శులు

ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అహ్మద్ నగర్ కు చెందిన రాఖియా తన కుమారుడి ఆధార్ పని నిమిత్తం గత నాలుగు రోజులుగా సచివాలయానికి వస్తోంది. అయితే ఎప్పుడు వచ్చినా సచివాలయంలో సిబ్బంది ఉండరని, ఒకసారి సచివాలయానికి వచ్చి వెళ్ళాలి అంటే రూ. 60 ఖర్చు అవుతుందని ఆమె వాపోయింది. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న మాకు సచివాలయం మా వార్డులో లేకపోవడంతో వేరే వార్డులో ఉన్న సచివాలయానికి ఆటోలో ఖర్చు చేసుకొని వెళ్ళినప్పటికీ సచివాలయ సిబ్బంది లేక మళ్లీ వెనక్కి రావాల్సిన వచ్చింది.

సోమవారం పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. దీంతో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి 32వ వార్డు పరిధిలోని అహ్మద్ నగర్ ప్రాంతానికి చెందిన బిబి అయిషా మేళాపురం సర్కిల్ లో ఉన్న 32 వ వార్డు సచివాలయానికి వెళ్ళింది. అయితే సచివాలయంలో సెక్రెటరీలు ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగి వచ్చింది. ఇలా ఒక్క రాఫియా, బిబి అయిషా లే కాదు ఎంతోమంది అహ్మద్ నగర్ తో పాటు 32వ వార్డు పరిధిలో ఉన్న వివిధ ప్రాంతాల వారు పడుతున్న బాధలు ఇవి.

ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలన్న సంకల్పంతో ప్రతి వార్డులో ఒక్కొక్క సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని వార్డులలో ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ఇతర వార్డుల్లో ఉన్న ప్రభుత్వ భవనాల్లో సచివాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో 32 వ వార్డు సచివాలయం అదే వార్డులో అద్దె భవనంలో కొనసాగుతుండేది. అయితే దానిని మేళాపురం సర్కిల్ లో ఉన్న సచివాలయ భవనంలోకి మార్చారు. 31 వ వార్డు కు సంబంధించిన సచివాలయం సైతం ఇక్కడికే మార్చారు. దీంతోపాటు 33 వ వార్డు కు సంబంధించిన సచివాలయం సైతం ఇక్కడే ఉన్నాయి. మూడు సచివాలయాలు ఒకే చోట ఉన్నాయి. ఇలా పురపాలక సంఘంలో పలు సచివాలయాలు వేరే వార్డుల్లో నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రత్యేక గ్రీవెన్స్ సమయంలో సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ సచివాలయంలో అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అయితే



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న 32వ వార్డు సచివాలయం

32వ వార్డు సచివాలయ సెక్రటరీలు కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. సచివాలయంలో ఒక్క సెక్రటరీ సైతం అందుబాటులో లేకపోవడం చూస్తుంటే అధికారులు ఆదేశాలను సచివాలయ సిబ్బంది ఏ విధంగా పాటిస్తున్నారో అర్థం అవుతుంది. ప్రత్యేక గ్రీవెన్స్ ఉండడంతో ఇతర వార్డుల నుంచి ప్రజలు మండుటల్లో నడిచి రాలేక ఆటోల్లో డబ్బులు ఖర్చు పెట్టుకుని వచ్చి వెనక్కి వెళ్లారు. అధికారులు ఇప్పటికైనా సచివాలయాలను పరిశీలించి ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయా వార్డు ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన సంఘటన పుట్టపర్తి మండల పరిధిలోని రాచువారి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నంబూరి ప్రసాద్ (46)గ్రామ సమీపంలో తన పొలంలో, కళింగరి ,దోస పంటలను సాగు చేస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నీటి తడులు అందించడానికి పొలం వద్దకు వెళ్లారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో విద్యుత్ నియంత్రికుల వద్దకు వెళ్ళగా, ప్రధాన ఫీజు ఎగిరిపోవడంతో దానిని వేయడానికి ప్రయత్నించారు. అంతలో విద్యుత్తు సరఫరా జరిగి షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో నంబూరి ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయ తెలిసి వెంటనే ఎఎస్ఐ ప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలిచారు. మృతునికి భార్య చంద్రకళ, కుమార్తెలు హర్షిత తేజస్విని ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పార్నపల్లి చిత్రావతి రిజర్వాయరు నుండి పట్టణానికి సరఫరా చేస్తున్న తాగునీటి పథకంలో దొరిగల్లు పంపుహౌస్ నందు మోటారు మరమ్మతుకు గురికావటంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మోటరు మరమ్మతుకు పది రోజులు సమయం పడుతుందని అంతరాయానికి ప్రజలు సహరించాలని అధికారులు తెలిపారు . మోటర్ మరమ్మతులు కారణంగా ఈనెల 8 నుండి 17 వరకు పట్టణానికి తాగునీరు సరఫరా తక్కువగా ఉంటుందని పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

'పది' విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు ధర్మవరం పట్టణం రేగాటిపల్లి రోడ్డులో గల వివేకానంద కళాశాలలో శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. పాలిసెట్, ఎపిఆర్‌జెసి, ఆర్జీటీ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ అవకాశాన్ని పదవతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో చిరుధాన్యాల ఆధారిత ఆహారాన్ని ప్రవేశపెట్టాలని ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శరత్ కుమార్ రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. చిన్న వయసు నుంచే చిరుధాన్యాలు తినడం అలవాటు చేసుకుంటే శరీర ధృడత్వం పెరగడమే కాకుండా తెలివి తేటలతోపాటు మంచి ఆరోగ్యంగా విద్యార్థులు ఉంటారని అన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు నాయక్, ఆంజనేయులు, సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విఒఎలకు శిక్షణ

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

స్థానిక పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో యానిమేటర్లకు, విఒఎలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డిఆర్‌డిఎ ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర నిర్వహించారు సోమవారం జరిగిన ఈ శిక్షణలో 2025-26 ఆర్థిక సంవత్సరములో జీవనోపాదుల కార్యాచరణ ప్రణాళిక, మహిళా సంఘాల ఏర్పాటు, రుణసదుపాయాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎలొసి సీసీ మునెప్ప, సిబ్బంది వేణుగోపాల్, సోమశేఖర్ రెడ్డి, వెంకటరమణ, చెన్నకేశవ, చంద్రా రెడ్డి, ఎమ్మెస్ అధ్యక్షులు వెంకటలక్ష్మి, సమాఖ్య అకౌంటెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలను వెలికి తీయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అక్రమాలకు వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన దూలం పురుషోత్తం ఆధ్వర్యంలో పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రికి రాత్రి మస్టర్లు మార్చేసి దొంగ బిల్లులు పెట్టుకుని లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. మండల స్థాయి అధికారుల అవినీతి బాగోతాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనధికారిక సర్వే.. రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - పావగడ

సర్వే శాఖ నుంచి అనుమతులు పొందకుండా ప్రైవేట్ సోలార్ కంపెనీ తరపున సర్వే శాఖకు చెందిన కొందరు అధికారులు సర్వే పనులు చేయించారని తాలూకాలోని వల్లూరు ఇంటూరాయనహళ్లి రైతులు సోమవారం ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాంజెగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వల్లూరు, ఇంటూరాయనహళ్లి గ్రామాల్లో 2300 ఎకరాల విస్తీర్ణంలో ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ సోలార్ పనులను ప్రారంభించిందని, ఇరుగుపొరుగు రైతులకు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు ఇవ్వకుండా, ఇలాఖా మార్గదర్శకాలు పాటించకుండా కొందరు అధికారులు 2300 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులను కార్యాలయం నుంచి తెప్పించి సర్వే చేయించారని రైతులు ఆరోపించారు. సర్వే నంబర్ 100/2లోని భూమిలో చట్టబద్ధమైన రహదారి లేదని కానీ పనుల కోసం భారీ వాహనాలను నడుపుతూ భూమిని ధ్వంసం చేశారని పొలంలో ఉన్న బావిని కూడా కప్పేశారని, దీంతో ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారనిరైతుల మధ్య తగాదాలు జరుగుతున్నాయని రైతు నాయకుడు పోతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య గురించి ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాంజెగౌడ్ స్పందిస్తూ ఫిర్యాదుపై కార్యాలయంలో విచారణ జరుపుతామని తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

క్రీడలు శరీర దృఢత్వాన్ని పెంచుతాయని టిడిపి నాయకుడు సందా రాఘవ అన్నారు. ధర్మవరం పట్టణం లోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర హాకీ పోటీ కార్యక్రమానికి ఆయనతో పాటు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, పళ్లెం వేణుగోపాల్, ఉడుముల రామచంద్ర, కలవల మురళీధర్ కూడా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ముఖ్య అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం హాకీ ఏపీ స్టేట్ ఉపాధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ హాకీ క్రీడలను జాతీయ స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గౌరీ ప్రసాద్ , కోశాధికారి అంజన్న, హాకీ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు, హాకీ అభిమానులు పాల్గొన్నారు.

యోగి వేమన ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కట్టారుపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న శ్రీ యోగి వేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు చిత్తూరు, కడప, నెల్లూరు తదితర జిల్లాల నుంచి కాకుండా కర్నాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాకదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఆలయ పీఠాధిపతి తుంగ నంద వేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, వాల్మీకి సంఘం నాయకులు డి ఆనంద్, అక్రం బాషా, రామంజులు రెడ్డి, సర్పంచి శివప్ప నాయుడు, దాసిరెడ్డి, కేశవరెడ్డి, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు

సుంకం వసూలుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మేజర్ గ్రామపంచాయతీ లోని డైలీ మార్కెట్, ఆటో స్టాండ్ సుంకాల వసూలుకు మార్చి 31వ తేదీకి కాంట్రాక్టర్లకు ముగిసినా వ్యాపారస్తుల ఆటోల నుండి సుంకం వసూలు చేస్తున్నారనిమానవ హక్కుల సంఘం నాయకులు ఎం వి పాపన్న విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నటరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకం వసూలు చేయడానికి గడువు ముగిసిందన్నారు. వేలం పాటలు మార్చి నెలలో నిర్వహించాల్సుండగా పంచాయతీ వారు వాయిదా వేశారన్నారు. పంచాయతీ వారే ఈ సుంకాన్ని వసూలు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు వసూలు చేస్తున్నారన్నారు. దీనితో వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఎవరికి సుంకం ఇవ్వాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేలం పాటల నిర్వహించకుండానే సుంకం వసూలు చేయడం వారికి తగదన్నారు. ఎంపీడీవో నటరాజ్ మాట్లాడుతూ త్వరలోనే వేలం పాటలు నిర్వహిస్తామని సుంకం వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫ్యాన్లు వితరణ

చిలమత్తూరు : మండల కేంద్రంలోని పశువైద్యశాలకు జనసేన నాయకులు ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ మేరకు వారు సోమవార పశువైద్యశాలను సందర్శించారు. ఫ్యాన్లు రిపేర్ కి వచ్చే ఆగినందున ఫ్యాన్లు పనిచేయకపోవడంతో విషయం తెలుసుకున్న జనసేన నాయకులు, కొత్త ఫ్యాన్లను వైద్యుడు పురుషోత్తం రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా పోగ్రాం కమిటీ సభ్యులు అగ్గి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు లక్ష్మణమూర్తి, టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా మార్చాలని వినతి

కొత్తచెరువు : కొత్తచెరువులోని పాత ఆంధ్ర బ్యాంకు వెనుక ఉన్న కె ఏ రావుఫ్ అఫ్సర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాలను ఉర్దూ ఉన్నత పాఠశాల గా మార్చాలని దర్గా కమిటీ మాజీ మేనేజర్ హతావుర్ రెహమాన్ ఎంపీటీసీ రఫీ, వార్డు మెంబర్ వాజిద్, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక డీఈవో కార్యాలయంలో డిఇఒ కిష్టప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 518-2 నందు రావుఫ్ పేరునా ఇక్కడ స్థలం ఇవ్వడంతో 2005వ సంవత్సరము నుండి ఉర్దూ పాఠశాల నిర్వహిస్తున్నారని ఇటీవల 8వ తరగతి వరకు తరగతి గదులు నిర్వహిస్తున్నారని అన్నారు. పదవ తరగతి లేని కారణంగా విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని కావున తక్షణమే పదవ తరగతి వరకు ఉర్దూ పాఠశాలను మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

హిందూపురం : పిల్లలు చెప్పిన కథలు- పిల్లల భావవ్యక్తీకరణ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హిందూపురం రూరల్ మండల పరిధిలోని పెద్దగుడంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రంగమ్మను సోమవారం ఘనంగా సన్మానించారు. సంబంధిత అంశంలో విద్యార్థులను ప్రోత్సహించి భావవ్యక్తీకరణకు, సృజనాత్మకకు కృషి చేయడంతో ఆమెకు పుస్తక మిత్ర ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం లభించింది. ఈ నేపథ్యంలో ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రంగమ్మను ఘనంగా సన్మానించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి తెలిపారు. సోమవారం పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతా శిశు మరణాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజాబేగం, డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, ఆర్‌విఎస్‌కె కోఆర్డినేటర్ నివేదిత, మెడికల్ ఆఫీసర్ జోష్న, ముని చంద్రిక, సిడిపిఒ భారతి, జిల్లా టిబి యూనిట్ అధికారి తిప్పయ్య, హెల్త్ ఆఫీసర్ నగేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, ఉమాపతి, సుధాకర్, పలువురు కూటమి నాయకులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో చెట్లు నరికివేత

నిలదీసిన గ్రామస్తులు
పరిశీలించిన ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి - పరిగి

కొట్టించిన చెట్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారి.

మండలంలోని కొడిగేనహళ్లి బీసీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో పూర్వ విద్యార్థులు పెంచిన చెట్లను హాస్టల్ వార్డెన్ కొట్టి వేయించారు. కనీసం అనుమతులు కూడా తీసుకోకుండా ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా హాస్టల్ పరిసరాల్లో ఉన్న 20 చెట్లను కొట్టించారు. అంతేకాకుండా ఈ కలపను రాత్రికి రాత్రే ప్రైవేట్ స్థలంలో పెట్టించారు. స్థానికులు దీనిని గమనించి వార్డెన్‌ను ప్రశ్నిస్తే ఆయన నిర్లక్ష్యపు సమాధానమిచ్చారు. దీంతో గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫారెస్టు అధికారులు సోమవారం స్థానిక హాస్టల్‌ను పరిశీలించారు. చెట్ల నరివేతపై ఎస్ఐకు వివరించి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్లో చెట్ల నరికివేతకు పాల్పడిన హాస్టల్ వార్డెన్ చిన్నయ్య బాబును సస్పెండ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మాజీ ముఖ్యమంత్రి పర్యటనలో

అవాంఛనీయ సంఘటనలు జరిగితే చర్యలు

ప్రజాశక్తి పెనుకొండ

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాపిరెడ్డిపల్లి గ్రామంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్న సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రత్న హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రామగిరి మండలం లో ఎలాంటి గొడవలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. గత వారంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో లింగమయ్య అనే వ్యక్తి మృతి చెందాడన్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. పాపిరెడ్డి పల్లి గ్రామం తో పాటు రామగిరి మండలం లో ఎలాంటి గొడవలు జరగకుండా పూర్తిగా శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నామన్నారు. స్పెషల్ పార్టీ పోలీసులతో పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు.పాపిరెడ్డిపల్లి గ్రామం చిన్న గ్రామం ఇరుకైన రోడ్లు ఉండడంతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడానికి వీలుకాని పరిస్థితి ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీ నాయకులు పోలీసుల సూచనలు మేరకు నడుచుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి తోపాటు నిర్దేశించి నాయకులు మాత్రమే గ్రామ సందర్శన చేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు ఏమాత్రం విఘాతం కలిగించరాదని అలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

నీలకంఠాపురంలో సామూహిక వివాహాలు

ప్రజాశక్తి మడకశిర రూరల్

మంగళసూత్రం అందజేత

మండల పరిధిలోని నీలకంఠాపురంలోనినీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం 18 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహించారు ఈ కార్యక్రమానికి కర్నాటక రాష్ట్రంలోని పట్టనాయకనహళ్లి మఠాధిపతులు నంజవధూత స్వామీజీ, ఆలయ కమిటీ అధ్యక్షులు సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, మడకశిర మాజీ శాసనసభ్యులు సుధాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ ఆలయంలో 44 సంవత్సరాల క్రితం మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీరామ రెడ్డి ప్రారంభించారు అప్పటినుండి ఉచిత సామూహిక వివాహాలు కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారు .ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా సీతారాములవారికి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు అలాగే ఆలయంలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించడం జరుగుతోంది.

జగన్‌ను చట్టబద్ధంగా ఎదుర్కొంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గం పాపిరెడ్డి పల్లికి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం రానున్న సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అనుకుంటే వైసీపీ నేత జగన్ ఇక్కడ అడుగు పెట్టలేరని అన్నారు. ఎక్కిన హెలికాప్టర్ ను దిగకుండా తిరిగి పంపే శక్తి ఉందని అన్నారు. అయితే తమకు చంద్రబాబు నాయుడు ఇలాంటి సంస్కృతి నేర్పలేదన్నారు. గతంలో పరిటాల రవి పులివెందులకు వెళ్లినప్పుడు వారు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ఒక చావును రాజకీయం చేయడానికి జగన్ రెడ్డి వస్తున్నాడని,,ఇక్కడ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా బాధిత కుటుంబానికి సాయం చేయాలని సూచించారు.

రీ సర్వే పురోగతిని పరిశీలించిన ఆర్డీవో

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని నక్కలపల్లి, తూమకుంట గ్రామాలకు సంబంధించిన రీ సర్వే వివరాలను పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు నిర్వహించిన రిసర్వే వివరాలను తహశీల్దార్ వెంకటేశు తో చర్చించారు. ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి తోడు జాతీయ రహదారి 716 కు సంబంధించి ముద్దనూరు నుండి గోరంట్ల టు హిందూపురానికి సంబంధించిన పురోగతిని కూడా తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, ఆర్ఐ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లను ప్రారంభించినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అనూరాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని అన్నారు. పదవ తరగతి హాల్ టికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు తో అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఉత్తీర్ణత తర్వాత అడ్మిషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలలో సీబీఎస్ఈ అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా ఎంబైపిసి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే సీఈసీ, హెచ్ ఈసి గ్రూపులు తెలుగు, ఆంగ్ల మధ్యమాలు ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు వివిధ గ్రూపులకు ఉర్దూ మీడియం, వృత్తి విద్యా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం

ప్రజాశక్తి - పావగడ

విద్యార్థులను చదువు పట్ల ఎప్పుడూ ప్రోత్సహిస్తామని పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అవసరమని ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేష్ తెలిపారు.సోమవారం తాలూకాలోని బి. హొసహళ్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకు తానెప్పుడు పెద్దపీట వేస్తానని, ఏ ఒక్క విద్యార్థి విద్యార్థి చదువుకు దూరం కాకూడదని అన్నారు. ఆంధ్రా సరిహద్దులో ఉన్న ఈ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, గ్రామస్తుల సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఎన్‌డిఎంసి అధ్యక్షుడు చింతలరెడ్డి, ఆర్.సి అంజినప్ప, మంజునాథ్‌రెడ్డి, ధర్మస్థల గ్రామాభివృద్ధి తాలూకా అధికారి మహేష్, రంగప్ప, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్135వ జయంతిని పురస్కరించుకుని బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన పెనుకొండలో జరిగే జై భీమ్ ర్యాలీ పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమం పోస్టర్లను స్థానిక అంబేద్కర్ భవన్ లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, రామ్మూర్తి, ఆనంద్, రిటైర్డ్ టీచర్ రామకృష్ణ, బాపూజీ నగర్ శ్రీరాములు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్లు రవి కుమార్, నాగరాజు, నాగార్జున, నరసింహులు, విక్కి, చందు, మల్లికార్జున, సింగిరెడ్డి పల్లి నాగరాజు, కొట్నూర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హిందూపురం గ్రామీణ మండలం గొల్లాపురం లో జైభీమ్ ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బీచిగానిపల్లి రామాంజి, బహుజన చైతన్య వేదిక నాయకులు రవి కుమార్, క్రిష్టప్ప, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం

ప్రజాశక్తి:- చిలమత్తూరు

మండల పరిధిలోని కోడూరు తోపు వద్ద ఉన్న కోదండ రాముడి ఆలయంలో రథోత్సవం, గ్రామోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మేరకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి మండల వ్యాప్తంగా ఉన్న భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లాల ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ,పార్థ సారథిలతో పాటు ఎమ్మెల్యే బాలక్రిష్ణ పిఎవీరయ్య పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కీలుబొమ్మల ప్రదర్శన ఆకట్టుకుంది. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు దాతలు అన్నదానం, పానకాలు,పెసరబ్యాల్లు పంచి పెట్టారు. కాగా సోమవారం రాత్రి చిన్నమ్మ కథ, బుధవారం రాత్రికి పూల పల్లకి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రథోత్సవ కార్యక్రమం లో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, జనసేన రమణ, తదితరులు పాల్గొన్నారు.